సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం : 14 : జనవరి : 2025



నల్లమలకు ఆధ్యాత్మిక శోభ
ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి.
వివరాలు 8లో ▸



సెమీస్‌లో తెలంగాణ జట్లు
నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలబాలికల జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 / 16.4
వాతావరణం
ఉదయం, రాత్రివేళల్లో చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైభవంగా గోదారంగనాథ స్వామి కల్యాణం



గద్వాలటౌన్: శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపం.. పచ్చని తోరణాలు.. బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ గోదా రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. పవిత్ర ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం స్థానిక పెద్ద ఆగ్రహారంలోని అహోబిలమఠంలో, భీంనగర్‌లోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో, స్థానిక రాజవీధిలోని రంగనాథ స్వామి ఆలయంలో వేర్వేరుగా నిర్వహించిన కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతి హోమం, గరిక పూజ, తలంబ్రాలు, మాంగళ్య ధారణ, ఒడి బియ్యంతో పాటు స్వామివారికి కానుకలను సమర్పించారు. మహిళలు, భక్తులు కల్యాణానికి సంబంధించిన వస్తువులను సమకూర్చి కల్యాణంలో పాల్గొన్నారు. ఆయా ఆలయాలలో ఆలయ పండితులు కల్యాణ మహోత్సవాలను నిర్వహించారు. ప్రస్తుతం సెలవులు ఉండటంతో గోదాదేవి, రంగనాథ స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు.

ఆర్డీఎస్ ఆయకట్టు రైతులను ఆదుకోండి

శాంతినగర్: ఆర్డీఎస్ ఆయకట్టు కింద సాగుచేసిన పంటలు ఎండుతున్నాయని, సాగునీరందించి ఆదుకోవాలని ఆర్డీఎస్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి అన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు కింద సాగుచేసిన పంటలను ఆయన సోమవారం సందర్శించారు. రైతుల సమస్యలు అడిగి తెలిసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మరో నాలుగు రోజుల్లో పంటలకు సాగునీరు అందకపోతే పంటలు ఎండి రూ.కోట్లలో రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని, టీబీ డ్యాం నుంచి అదనంగా నీటిని విడుదల చేసి తుమ్మిళ్ల లిఫ్ట్‌కు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటి విడుదల విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఏపీ, కర్ణాటక అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు కృషిచేస్తున్నారన్నారు.

భోగి సంబరం..

వైభవంగా సంక్రాంతి వేడుకలు





పుల్లూరులో భోగి మంటలు వేస్తున్న కుటుంబసభ్యులు

- రంగురంగుల ముగ్గులతో ఆకట్టుకున్న లోగిళ్లు
- బంధుమిత్రులతో కళకళలాడిన పల్లెలు
- పతంగులతో చిన్నారుల సందడి

గద్వాలటౌన్: ముంగిళ్ల ముందు గొబ్బెమ్మలతో ముచ్చటైన ముగ్గులు, వెచ్చదనాన్ని అందించే భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలతో జిల్లాలో సోమవారం సంక్రాంతి సంబురాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు సంస్కృతి, సాంప్రదాయానికి నిదర్శనంగా నిలిచే సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. పిండి వంటల ఘుమఘుమలు.. పతంగుల కోలాహలం.. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు.. వాటిలో కొత్తగా పండిన ధాన్యాలు.. గొబ్బెమ్మలు తదితర దృశ్యాలు కనిపించాయి. ప్రతి ఇంటి ముంగిళ్లు రంగ వల్లులతో మెరిసిపోయాయి. సరదాల సంక్రాంతి పండగను చిన్న, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. తెల్లవారుజామున నుంచే ప్రతి ఇంట్లో సంక్రాంతి సందడి కనిపించింది. నువ్వుల పొడితో స్నానాలు ఆచరించారు. మూడు రోజుల పండగలో భాగంగా మొదటిరోజు సోమవారం భోగి పండగను జరుపుకొన్నారు. భోగితో ప్రారంభమైన వేడుకలు కనుమతో ముగిస్తారు. సాంప్రదాయం వంటకాలు మొదటిరోజు సజ్జ, నువ్వులరొట్టెలు, తోడుగా రుచికరమైన కూరలు చేసుకున్నారు. ప్రతి ఇంటిలో వివిధ రకాలైన కాయగూరలతో కలకూర వండుకుని రుచికరమైన వంటలు ఆరగించారు.

కళకళలాడిన పల్లెలు..

గ్రామగ్రామాన పండగ వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రంతో పాటు అలంపూర్, వడ్డేపల్లి, అయిజ, మానవపాడు, మల్దకల్ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి సౌరభాలు వెల్లివిరిశాయి. గ్రామాల్లో భోగి మంటలు వేసి పండగ జరుపుకొన్నారు. బోగి మంటల చుట్టు యువత, చిన్నారులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. సూర్యోదయానికి ముందే మహిళలు లేచి ఇంటి ముందు అలుకు చల్లి ముచ్చటైన ముగ్గులు వేయడంలో పోటీ పడ్డారు. పండగ సెలవులకు వచ్చిన చిన్నారులతో ప్రతి ఇల్లు కళకళలాడింది. హరివిల్లు రంగుల్ని పులుముకున్న కాగితం పక్షులు గాలిపటాలతో పిల్లలు ఆనందంగా గడిపారు. పలు గ్రామాల్లో పిల్లల హృదయాలతో పాటు పెద్దలను సైతం గాలిపటాలు రంజింప చేశాయి. పండగను పురస్కరించుకొని పలుచోట్ల రంగవల్లుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

అయ్యవారికి దండం పెట్టు..

"అయ్యవారికి దండంపెట్టు.. అమ్మవారికి దండం పెట్టు.. ఈ ఇంటికి మంచి జరుగుతదని చెప్పు.." అంటూ గంగిరెద్దులను ఆడించే వారు అనగానే తల ఊపి అవునన్నట్లుగా సమాధానం ఇస్తుంది. సంక్రాంతి వేడుకల్లో డూడూ బసవన్నల ఆటలు కూడా ప్రధానమైనవి. ఆడించేవారు చెప్పినట్లుగా తల ఊపుతూ.. కాళ్లు కదుపుతుంటే గజ్జెల శబ్ధంతో ఇళ్ల మందు గంగిరెద్దులు చేసే విన్యాసాలు ఆకట్టుకుంటాయి. ఇంటి ముందుకు గంగిరెద్దు రాగానే ఇంట్లో ఉన్న కొత్త ధాన్యం గింజలను గంగిరెద్దులకు ఇరువైపుల ఉన్న జోళ్లలో పోసి ఆశీర్వాదం తీసుకుంటారు. 300–400 కేజీలు బరువున్న గంగిరెద్దు ఒక వ్యక్తిపై తన నాలుగు కాళ్లు పెట్టి ఊపిరిబిగబట్టడం చూస్తే గంగిరెద్దుకు, ఆ యజమానికి ఉన్న నమ్మకం బసవన్నకు ఉన్న ప్రత్యేకత.




గద్వాలలో ఓ ఇంటి ఎదుట ముగ్గులు వేస్తున్న యువతులు



ఇంటి ముందు గంగిరెద్దు, మనిషిపై నాలుగు కాళ్లుపెట్టి గంగిరెద్దు విన్యాసాలు



మహబూబ్‌నగర్‌లోని పతంగుల దుకాణం వద్ద రద్దీ..



గాలి పటమా.. పదపద..

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగ అంటే గాలిపటాలు ఎగురవేయడం అనవాయితీగా వస్తోంది. పిల్లలే కాదు.. యువకులు, పెద్దలు సైతం గాలి పటాలను ఎగురవేసేందుకు పోటీ పడుతుంటారు. ఇతరుల గాలిపటం కంటే మనదే ఎక్కువ ఎత్తులోకి ఎగురవేసే క్రమంలో కేరింతలు కొడుతారు. గాలిపటాల సందడి మార్కెట్లో సంక్రాంతికి పది రోజుల ముందు నుంచే ప్రారంభమైంది. జిల్లాకేంద్రంలోని ప్రధాన ప్రాంతాలు, వీధుల్లో గాలిపటాలను విక్రయిస్తున్నారు. కేవలం పట్టణాలకు వరకే ఉన్న గాలిపటాల హల్‌చల్ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు పాకింది. చక్కని ఆకృతితో ఆకట్టుకునేలా వివిధ డిజైన్ల పతంగులు మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నారులను ప్రత్యేకంగా ఆకర్షించేలా ప్రింటెడ్, కార్టూన్ గాలిపటాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది.

- గాలిపటాలను ఆకాశంలో ఎగురవేయడం ఒక ఎత్తయితే ఒకదానికి ఒకటి పోటీపడడం మరో ఎత్తు. ఎవరి గాలిపటాలు తెగి పడుతాయోన్న విషయం ఎవరికీ అర్థం కాదు. తెగిపడిన గాలిపటాలను తీసుకోవడానికి చిన్నారులు ఒక్కటే పరుగు తీస్తారు. మహబూబ్‌నగర్‌లోని పాన్‌చౌరస్తా పతంగుల మార్కెట్‌గా పేరొందింది. హైదరాబాద్‌లోని చార్మినార్, ధూల్‌పేట్, లాడ్‌బజార్ తదితర ప్రాంతాల నుంచి గాలిపటాలు, మాంజాలను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. రూ.5 నుంచి రూ.500 వరకు పతంగులు అందుబటులో ఉన్నాయి.

నోరూరించే పిండి వంటలు



కజ్జికాయలు

సంక్రాంతి పండుగలో కొత్త బియ్యంతో వివిధ రకాల పిండి వంటలకు తయారు చేస్తారు. సంక్రాంతి అనగానే ముందుగా గుర్తుచ్చేవి అరిసలు. బెల్లంతో తయారు చేసే అరిసెలు ఆరోగ్యానికి మంచిది. కొత్త బియ్యపు పిండి, నూనె, బెల్లం, నువ్వులతో అరిసెలు తయారు చేస్తారు. అదే విధంగా బియ్యపు పిండి, కొబ్బరి, నువ్వుల పిండితో బూరెలు చేస్తారు. వీటికి తయారీకి కొంతమంది పంచదార పాకాన్ని వాడుతారు. అలాగే నువ్వుల ఉండలు, కజ్జికాయలు కూడా సంక్రాంతి స్పెషల్ వంటకాలే. వీటితో పాటు సజ్జ రొట్టె, నేతితో చేసిన గారెలు, పాయసం, పరమాన్నం, జంతికలు, సున్నుండలు తయారుచేస్తారు.

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?

ఆర్డీఎస్ కెనాల్‌లో సమస్యల తిష్ట

- నిత్యం కోతలు, తాత్కాలిక మరమ్మతుతో రైతుల అవస్థలు
- అధికారుల పర్యవేక్షణ అంతంతే..
- మరమ్మతుకు రూ.13 కోట్లు మంజూరు
- పూర్తి లైనింగ్ చేస్తేనే మేలంటున్న ఆయకట్టు రైతులు

రాజోళి: జిల్లాలో ఆర్డీఎస్ కెనాల్ ప్రవహిస్తున్న మండలాల్లో కెనాల్‌పై ఆశలు పెట్టుకుని వేలాది మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా కెనాల్ మరమ్మతులు చేయకపోవడం.. ఆధునీకరణ చేపట్టకపోవడం.. అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండడంతో కెనాల్‌లో నీరున్నా కూడా రైతులకు ఏదో రకంగా నష్టమే జరుగుతుంది. కెనాల్‌లో నీరు వచ్చేదే అంతంత మాత్రం కాగా.. అది కూడా ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు రావో తెలియని పరిస్థితి. వచ్చినప్పుడు కెనాల్ కోతలకు గురికావడం పరిపాటిగా మారింది. దీంతో కెనాల్ నుంచి రైతులకు జరిగే మేలుతో పాటు నష్టం కూడా తప్పడం లేదు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలనే వాదన రైతుల నుంచి వినిపిస్తోంది.

తాత్కాలిక మరమ్మతుతోనే సరి..

కెనాల్ మరమ్మతుల కోసం రూ.13 కోట్లు కేటాయించినప్పటికీ అవి ఎక్కడ చేయాలనే అనుమానం, అధికారులకు, రైతులకు వెంటాడుతుంది. పూర్తిగా దెబ్బతిన్న చోట చేసేందుకు పనులు మొదలుపెట్టేలోగా మరో డిస్ట్రిబ్యూటరీ దగ్గర సమస్య మొదలువుతుంది. అన్ని చోట్ల ఒకేసారి పనులు చేసేంత నిధులు లేవు. తుమ్మిళ్ల లిఫ్ట నుంచి సాగు నీరు అందుతున్నప్పటి నుండి డి–24 దిగువకే ఎక్కువగా మరమ్మతులు చేయాల్సి వస్తుంది. తుమ్మిళ్ల ప్రెజర్ మెయిన్ కెనాల్ ద్వారా నీరు డి–24 దగ్గరే డెలవరీ కావడంతో కెనాల్ పటిష్టంగా ఉండాలి. ఏళ్ల కిందట చేసిన మరమ్మతులు కావడంతో కెనాల్ పూర్తిగా దెబ్బతింది. దీంతో తరుచూ ఇబ్బందులు తప్పడం లేదు. అందులో ప్రత్యేకించి తుమ్మిళ్ల నుంచి నీరు వచ్చే క్రమంలో కెనాల్‌పై ప్రెజర్ పడి కోతకు గురికావడం, కెనాల్‌లో సిల్ట్, గడ్డి, ముళ్ల కంపలు పెరిగి, నీరు సాఫీగా ప్రవహించకుండా కెనాల్‌పైకి ఎక్కి పారడంతో పక్కనే ఉన్న పంట పొలాల్లోకి నీరు వెళ్లి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. కాగా అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కూడా తరుచూ ఈ ఇబ్బందులు తప్పడం లేదని రైతులు అంటున్నారు. కెనాల్‌పై వారు నిత్యం పర్యవేక్షణ చేస్తే ఎక్కడెక్కడ అత్యవసరంగా మరమ్మతు చేయాలో తెలుస్తుందని రైతులు అంటున్నారు.



గత వారంలో నారాయణపురం వద్ద సిల్ట్, పిచ్చిమొక్కలు తొలగిస్తున్న రైతులు

లైనింగ్ లేక ఇక్కట్లు..

ఎంతకాలం గడిచినా కేవలం చిన్నపాటి మరమ్మతులతో సరి చేస్తే అవి కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తున్నాయని శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు అంటున్నారు. ప్రస్తుతం సిల్ట్ పేరుకుపోయిన చోట అది తీయకపోవడంతో పాటు, లైనింగ్ ఏర్పాటు చేయకపోవడం, కెనాల్‌కు ఇరువైపులా వేసిన సిమెంట్ బిల్లలు కూడా ఊడిపోవడంతో కెనాల్ కోత ,కెనాల్ పైకి నీరు ఎక్కి ప్రవహించడం జరుగుతున్నాయి. గత నెలలో మానవపాడు మండలం నారాయణపురం దగ్గర కెనాల్ పైకి నీరు ప్రవహించడంతో రైతుల పంట పొలాల్లోకి నీరు చేరింది. ఆ డిస్ట్రిబ్యూటరీ గేట్ల దగ్గర చనిపోయిన ఎద్దును పడేయడంతో దాని వల్ల కూడా నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నట్లు తెలస్తుంది. అది మాత్రమే కాకుండా కెనాల్‌లో విచ్చలవిడిగా పెరిగిన కంప చెట్లు, పేరుకుపోయిన సిల్ట్ కూడా ప్రధాన కారణమే అని రైతులు అంటున్నారు. వీటిపై సరైన పర్యవేక్షణ ఉన్నట్‌లైతే సమస్య అంత వరకు రాకుండా ముందస్తు చర్యలతో దాన్ని నివారించేవారమని రైతులు అంటున్నారు. అంతకు ముందు వడ్డేపల్లి మండలం, అంతకు పూర్వం రాజోళి మండలంలో కూడా కెనాల్ కోతకు గురయ్యాయి. దీనిపై పూర్తి పర్యవేక్షణ ఉంటే ముందస్తు మరమ్మతులు ఎక్కడ చేయాలో తెలుసుకుని అక్కడ పనులు చేసి ఉంటే కొద్ది మేరనైనా మేలు జరిగేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మరమ్మతులతో తాత్కాలిక ప్రయోజనం మాత్రమేనన్న విషయాన్ని గుర్తించి, ఆధునీకరణ కోసం అధికారులు ప్రయత్నాలు చేయాలని, నాయకులు వారికి సహకరించాలని అంటున్నారు. ఆధునీకరణ చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు క్షేత్ర స్థాయిలో ఆయకట్టుపై పర్యవేక్షణ చేయాలని అంటున్నారు.

నిత్యం ఆందోళన



ఆర్డీఎస్ కెనాల్‌లో నీరు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు ఆగిపోతుందో తెలియదు. అలాంటి కెనాల్ పై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు నిత్యం ఆందోళన తప్పడం లేదు. కెనాల్ లో నీరు నిండుగా వస్తున్నాయని సంతోషించేలోగా.. కెనాల్ కోతకు గురి కావడం,పైకి ఎక్కి ప్రవహించి పంటలను ముంచేస్తుంది. దీంతో పంటల నష్టం తప్పడం లేదు.
– వెంకటేశ్వర్లు, రైతు, చెన్నిపాడు

పంటలకు నీరందట్లే..



ప్రతి ఏడాది కెనాల్‌కు ఎక్కడో ఒక చోట మరమ్మతులు తప్పడం లేదు. ఎగువన ఎక్కడైనా చిన్న కోతకు గురైనా కెనాల్‌లో నీరు నిలిపి వేయాల్సిందే. దీని వల్ల పంటలకు సక్రమంగా నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణతో ఎక్కడెక్కడ మరమ్మతు అవసరమో పంటలు వేయకముందే వాటిని పూర్తి చేస్తే బాగుంటుంది. సాగు మధ్యలో కెనాల్‌లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలంటే చాలా కష్టంగా ఉంటుంది.
– గోవర్ధన్, మానవపాడు, రైతు

ప్రతిపాదనలు పంపించాం

గతంలో ఆర్డీఎస్ ఆధునీకరణ కోసం ప్రతిపాదనలు పంపించాం. కాని మంజూరు రాకపోవడంతో ప్రస్తుతం ఉన్న నిధులతోనే అవసరమైన చోట మరమ్మతులు చేస్తున్నాం. కొన్ని చోట్ల లైనింగ్ మార్చాల్సిందే. గత నెలలో నారాయణపురం డిస్ట్రిబ్యూటరీ దగ్గర చనిపోయిన ఎద్దును కూడా కెనాల్‌లో వేశారు. కొంత సిల్ట్, పిచ్చి మొక్కల కారణంగా నీరు కెనాల్ పైకి ఎక్కి ప్రవహించింది. రైతులతో సమన్వయం చేసుకుని వాటిని తొలగించాం.
– విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్డీఎస్ ఈఈ

మిగిలింది 12 రోజులే..

- 26తో ముగియనున్న పురపాలిక పదవీకాలం
- తీవ్ర నిరాశలో పాలకవర్గాలు
- ఆశించిన మేర అభివృద్ధి చేయలేదని ఆవేదన
- మళ్లీ పోటీ చేయాలనే ఆలోచన ఉన్నవారు మాత్రమే వార్డు సమస్యలపై దృష్టి
- రిజర్వేషన్లు మారుతాయనే ప్రచారం



అచ్చంపేట: మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం మరో 12 రోజుల్లో ముగియనుంది. అయితే ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదని పాలకవర్గాలు తీవ్ర నిరాశలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతికి నిధులు రాకపోవడంతో అభివృద్ధి చేయలేకపోయామని చాలా మంది కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన మున్సిపాలిటీలకు ఇవ్వాల్సిన నిధులు మంజూరు చేయలేదని వాపోతున్నారు. అయితే మళ్లీ పోటీ చేయాలనే ఆలోచన ఉన్న వారు మాత్రమే వారి వార్డుల్లో తిరుగుతూ సమస్యలు పరిష్కరించడం వంటివి చేయిస్తున్నారు. పోటీ చేయాలనే ఆలోచన లేనివారు మాత్రం వార్డులను గాలికి వదిలేశారు.

అవిశ్వాస తీర్మానాలతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన నారాయణపేట మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్ (బీఆర్ఎస్)పై అవిశ్వాసం పెట్టాలని తీర్మానం చేశారు. ఆ తర్వాత అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ పదవి నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన అనంద్‌గౌడ్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా షబ్బీర్ అహ్మద్ ఎన్నికయ్యారు.

- కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష (బీఆర్ఎస్)పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో 11 మంది కౌన్సిలర్లు వ్యతిరేకంగా ఓటేయడంతో ఆమె గద్దె దిగారు. వివిధ నాటకీయ పరిణామాల మధ్య నెలరోజుల తర్వాత వైస్ చైర్మన్ అన్నపూర్ణను చైర్మన్‌గా ఎంపిక చేశారు. మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.
- వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ (బీఆర్ఎస్)పై ఆరు నెలల క్రితం అవిశ్వాసం తీర్మానం పెట్టగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పుట్టపాగ మహేష్ నూతన చైర్మన్‌గా ఎన్నికయ్యారు.
- కొల్లాపూర్ బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మిపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గారు. ఆ తర్వాత చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన రమ్యకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా బీజేపీతో కలిపి 15 మంది కౌన్సిలర్లతో ఎక్స్‌అఫీషియో సభ్యులు ఎమ్మెల్యే వంశీకృష్ణ అవిశ్వాసానికి మద్దతు తెలపడంతో నెగ్గారు. మారిన పరిణామాల్లో కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసులు చైర్మన్‌గా ఎన్నికయ్యారు.
- జడ్చర్ల బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మిపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అదే పార్టీకి చెందిన పుష్పలత చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

- ఉమ్మడి జిల్లాలో 19 మున్సిపాలిటీలు ఉండగా అచ్చంపేట, జడ్చర్ల మినహా 2020 జనవరి 22న 17 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించారు. 25న ఓట్ల లెక్కింపు జరిగాయి. వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, అయిజ, గద్వాలతోపాటు.. కొత్త మున్సిపాలిటీలైన భూత్పూర్, పెబ్బేరు, వడ్డేపల్లి, మక్తల్, కొత్తకోట, కోస్గి, కొల్లాపూర్, ఆత్మకూర్, అమరచింత, అలంపూర్‌లకు ఎన్నికలు నిర్వహించగా.. బీఆర్ఎస్ 8 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజార్టీ సాధించగా.. ఇతరుల అండతో మరో మూడు పీఠాలు దక్కించుకుంది. కొల్లాపూర్, అయిజలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అధిక్యం కనబర్చినా.. ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతుతో ఈ రెండు మున్సిపాలిటీలు కూడా బీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లాయి. వడ్డేపల్లిలో కాంగ్రెస్, మక్తల్‌లో బీజేపీ గెలుపొందగా.. వడ్డేపల్లి చైర్మన్‌తో సహా మెజార్టీ కాంగ్రెస్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. కోస్గి, భూత్పూర్‌లో హంగ్ ఏర్పడగా ఈ రెండు మున్సిపాలిటీలు బీఆర్ఎస్‌కు చెందిన వారే చైర్మన్లుగా ఎన్నికయ్యారు.
- అచ్చంపేటకు రెండోసారి, జడ్చర్ల మున్సిపాలిటీ ఏర్పాటైన పదేళ్ల తర్వాత 2021 ఏప్రిల్ 30 ఎన్నికల పోలింగ్, మే 3న ఓట్ల లెక్కింపు చేపట్టారు. అచ్చంపేటలో 20 వార్డులకు గాను బీఆర్ఎస్ 13, కాంగ్రెస్ 6, బీజేపీ 1 చొప్పున గెలుపొందారు. జడ్చర్లలో 27 వార్డులకు గాను బీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 2, బీజేపీ 2 గెలిచాయి.

ఎన్నికలా.. ఇన్‌చార్జ్ పాలనా

ఈ నెల 26న మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగుస్తోంది. ఇందుకు ఇంకా 12 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆ తర్వాత ఎన్నికలు వచ్చే వరకు ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతుంది. 2023 జూన్ నుంచి పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు. ప్రతినెలా ఆయా మున్సిపాలిటీల జనాభా ప్రకారం రూ.30 నుంచి రూ.60 లక్షల వరకు నిధులు వచ్చేవి. ఈ నిధులు ఇప్పుడు నిలిచిపోవడంతో సమస్యలు పేరుకుపోయాయి. ఇతర ఎలాంటి నిధులు రాకపోవడంతో చేసిన పనుల బిల్లులు పెండింగ్ ఉన్నాయి.

రిజర్వేషన్లు మారే అవకాశం

గత రెండు ఎన్నికల్లో రిజర్వేషన్లు మారాయి. ఈసారి కూడా రిజర్వేషన్లు మారుతాయనే ప్రచారం జోరుగా జరుగుతోంది. గత ప్రభుత్వం రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగేలా మున్సిపల్ చట్టం తీసుకొచ్చింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం రిజర్వేషన్లు మార్పు చేస్తూ అసెంబ్లీలో చట్టం తీసుకొచ్చింది. కొత్త చట్టం ప్రకారం ఐదేళ్లకోసారి రిజర్వేషన్లు మారుతాయి. రిజర్వేషన్లు మారితే అవకాశం వస్తుందా.. రాదా అని ఆశావహులు ఆలోచనలో పడ్డారు. ప్రస్తుతం ఉన్న వార్డుల్లో అభివృద్ధి చేసిన వారు వార్డు మారితే చేసిన వార్డులో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అభ్యర్థిస్తామని చెబుతున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీలు సవాల్‌గా తీసుకుని పని చేసే అవకాశం ఉంది.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

తెలకపల్లి: చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన తెలకపల్లి మండలం లక్నారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల మేరకు.. లక్నారం గ్రామానికి చెందిన మన్యం మహేష్ (40) అదే గ్రామానికి చెందిన సుధాకర్ పొలంలో వ్యవసాయ పనులు చేసేందుకు సోమవారం వెళ్లాడు. మధ్యాహ్నం సమీపంలోని చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లిన అతడు.. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


సింగరాజు శేఖర్ (ఫైల్)

తెలకపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు., మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సింగరాజు శేఖర్(39) రెండేళ్లుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. ఇటీవలే భార్య మంగమ్మ, అతని తండ్రి రాములు మందలించారు. మనస్తాపం చెంది ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మరో వ్యక్తి..

కోస్గి రూరల్: మండలంలోని ముక్తిపాడ్‌కు చెందిన కుర్వ బాలప్ప (40) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు బాలప్ప రెండేళ్ల క్రితం కొత్త ఇల్లు కట్టేందుకు అప్పులు చేశాడు. ఎంతకూ అప్పులు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో గతనెల 19న తన వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగి, తన భార్య భాగ్యమ్మకు ఫోన్‌చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు కుర్వ మల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

- వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధి రాయికల్ సమీపంలోని బైపాస్ రహదారిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం, కల్లెపల్లి గ్రామానికి చెందిన బాలమైసయ్య(45) రాయికల్ శివారులోని బాబా దాబా (ఎన్‌హెచ్‌-44) సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైద్రాబాద్ నుంచి జడ్చర్లవైపు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం బాలమైసయ్యను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలమైసయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయం కల్లెపల్లి గ్రామం సోషల్ మీడియాలో రావడంతో గుర్తించిన మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. మృతుడి బంధువు లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

నల్లమలకు ఆధ్యాత్మిక శోభ

- నేటి నుంచి 22 వరకు ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ నిర్వాహకులు


నల్లమల కొండల్లో వెలసిన ఉమామహేశ్వర క్షేత్రం

అచ్చంపేట: శ్రీశైల క్షేత్రం ఉత్తరద్వారంగా బాసిల్లుతున్న ఉమామహేశ్వర క్షేత్రం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. నల్లమల కొండల్లో వెలసిన ఉమామహేశ్వరుడి ఉత్సవాలను ప్రతి ఏటా ఉత్తరాయణ కాలంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం నుంచి 22వ తేదీ వరకు వారం రోజులపాటు స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. స్వామివారి దర్శనం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలిరానున్నారు.

ఎత్తైన కొండలపై..

ఐదు వందల అడుగుల ఎత్తైన నల్లమల కొండలపై ఉమామహేశ్వర క్షేత్రం వెలసింది. శ్రీశైల క్షేత్రానికి ఉత్తర ద్వారంగా, ఉమాశక్తి పీఠంగా ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెందింది. రావణాసురుడిని చంపిన తదుపరి శ్రీరాముడు శ్రీశైలం ప్రదక్షిణను ఉమామహేశ్వర క్షేత్రం నుంచి ప్రారంభించినట్లు స్థల పురాణం చెబుతోంది. అహోబిలం, మహానంది, శ్రీశైలం తదితర పుణ్య క్షేత్రాలు వెలసిన నల్లమల ప్రాంతంలోనే ఈ క్షేత్రం ఉంది. ఈ క్షేత్రం కొండ బాణం ఆకారంలో వంపు తిరిగి ఉండటంతో అందరినీ ఆకట్టుకుంటోంది. రెండు కొండలు ఒకదానిపై ఒకటి అమర్చినట్లు ఉండటం విశేషం. మొదటి కొండపై రెండోది 20 అడుగుల ఎత్తున ఉంటుంది. కింది కొండ విశాలంగా ఉండగా.. పైన ఉన్న కొండ కేవలం ఐదు అడుగుల వెడల్పు మాత్రమే ఉంది.

నిత్యాన్నదానం..

పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కొండ దిగువన భోగ మహేశ్వరంలో హరిత గదులు, ఆహ్లాదకరమైన ఉద్యానవనం ఏర్పాటు చేశారు. కొండ కింద కోనేరు నుంచి ప్రధాన ఆలయం వరకు 600 మెట్లు, విశ్రాంతి గది, పాపనాశం వద్ద ప్రత్యేక స్నానపు గదులు, డ్రెసింగ్ రూములు నిర్మించారు. ఆలయం నుంచి నాగుల వరకు ప్రాంగణాన్ని విస్తరించారు. క్షేత్రంలో నాలుగేళ్లుగా నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాతలు, భక్తులు సమర్పించే విరాళాలతో రోజు 600 నుంచి 1000 మంది ఆకలి తీరుస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

మంగళవారం సాయంత్రం 4 గంటలకు అయ్యప్పస్వామి పూజ, 6 గంటలకు మకరజ్యోతి దర్శనం అనంతరం మంగళహారతి ఉంటుంది. 15న సాయంత్రం 7 గంటలకు ఉత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాపన, బలిహరణం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు అచ్చంపేట భ్రమరాంబ దేవాలయంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక అలంకరణలతో ప్రభలు ఉమామహేశ్వరానికి వస్తాయి. రాత్రి 2 గంటలకు పార్వతీ పరమేశ్వరుడి ఉత్సవ మూర్తులు ఉమామహేశ్వరం కొండపై నుంచి మంగళవాయిద్యాలతో పల్లకీలో దిగువ ఉన్న భోగ మహేశ్వరం చేరుకుంటారు. 16న తెల్లవారు జామున పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు పల్లకి సేవ ఉంటుంది. 17న అశ్వవాహన సేవ, 18న నందివాహన సేవ ఉంటుంది. 16నుంచి 22వ తేదీ వరకు ఉత్తరాయణ పుణ్యకాల స్నానాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

శరవేగంగా అభివృద్ధి..

భోగ మహేశ్వరంలో అసంపూర్తిగా వదిలేసిన పంచలింగాలు, రాజగోపురం ఇతర పనులను శరవేగంగా చేపడుతున్నారు. రూ. 50లక్షలతో పంచలింగాలు, కల్యాణ మండపం, ప్రహరీ నిర్మాణం, రూ. 3లక్షలతో జత లింగాలు, రూ. 8.80 లక్షలతో ఓం నమఃశివాయ గార్డెన్ అభివృద్ధి చేశారు. రూ. 50 లక్షలతో కోనేరు, రూ. 25లక్షల వ్యయంతో అసంపూర్తిగా ఉన్న రాజగోపురం, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. రూ. 12లక్షలతో పురోహితులకు రెండు గదులు, రూ. 50లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. కోనేరు పునరుద్ధరణ కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు రూ. 30లక్షలు మంజూరు చేయించారు. దాతల సహకారంతో మెట్ల మార్గంలో రూ. 30లక్షలతో భారీ స్వాగత తోరణం, శివుడి విగ్రహం ఏర్పాటుకు చేసేందుకు ఆలయ కమిటీ చైర్మన్ భీరం మాదవరెడ్డి కృషి చేస్తున్నారు.

భ్రమరాంబికాదేవి ప్రభోత్సవానికి ముస్తాబు


భ్రమరాంబికాదేవి మూలవిరాట్

అచ్చంపేట: నల్లమల కొండల్లో వెలసిన ఉమామహేశ్వరుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం అచ్చంపేట ప్రజల ఇలవేల్పు భ్రమరాంబికాదేవికి ప్రభోత్సవం నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంపై పార్వతీదేవి ఉత్సవ మూర్తిని పట్టణ పురవీధుల్లో ఊరేగించిన అనంతరం ఉమామహేశ్వర క్షేత్రానికి తీసుకెళ్తారు. గురువారం తెల్లవారుజామున పార్వతీదేవిని, ఉమామహేశ్వరం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులను కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరంలోని మండపానికి తీసుకువచ్చి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి ప్రభోత్సవానికి ప్రజాప్రతినిధులతో పాటు వందలాది భక్తులు తరలిరానున్నారు. ఊరేగింపులో భజనలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భోగమహేశ్వరంలో ఉమామహేశ్వరుడి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


ప్రభోత్సవానికి ముస్తాబైన అచ్చంపేట భ్రమరాంబ ఆలయం

ఎత్తం గట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఎత్తం రామలింగేశ్వరస్వామి గట్టు

- మూడు రోజుల పాటు వేడుకలు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కోడేరు: ఎత్తం గట్టు రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు ప్రతియేటా సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. కోడేరు మండలంలోని ఎత్తం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తం రామన్న గట్టు వెలిసింది. త్రిభుజకారంలో ఉన్న గట్టు ఎత్తు దాదాపు 1,400 అడుగులు ఉంటుంది. శిఖరంపై శివకేశవ లింగ రూపంలో రామలింగేశ్వరస్వామి దర్శనమిస్తారు. కండ్ల నీలాలు, ముష్టి, పట్టం, కోరమీసాలు కలిగి ఉన్న రామలింగేశ్వరస్వామికి జనవరి 14న, మకర సంక్రాంతి పండుగ రోజు సామగ్రితో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాయిచూర్ నుంచి భక్తులు వచ్చి స్వామివారికి తలనీలాలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. వేలాది మంది భక్తులు కాలినడకన గట్టుపైకి వస్తుంటారు. గట్టుపై కేవలం రెండు అడుగుల వెడల్పు మాత్రమే ఉంటుంది. పండుగ రోజు గట్టుపై మరక జ్యోతి వెలిగించగా.. ఈ దీపం కర్నూలు, రాయిచూర్, గద్వాల, ఇతర రాష్ట్రాల వారికి కనిపిస్తుందని పూర్వీకుల నమ్మకం.

కాకతీయుల కాలంలో..

కాకతీయుల కాలంలో వేపూర్ హనుమదాసు, గొల్లపల్లి వెంకటదాసు వంటి వారు స్వామిని దర్శించుకున్నారని పూజారి మురళీధర్ తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు భక్తుల సందడి ఏమాత్రం తగ్గకుండా మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వామివారిని మూడుసార్లు దర్శించుకుంటే సకల పాపాలు తొలగి సుఖసంతోషాలతో ఉంటారని పూజారులు పేర్కొన్నారు. గట్టుపై వివిధ రకాల జంతువులు, వృక్షాలు, నెమళ్లు, రకరకాల పాములు, రంగు రంగుల పక్షులతో ప్రకృతి రమణీయంగా ఉంటుంది. మండలంలో వర్షాలు కురవకపోతే గట్టుపైకి వెళ్లి భజనలు చేస్తూ వరుణ పాయసం చేసి రాత్రివేళలో దీపారాధన చేస్తే వరుణుడు కరుణిస్తాడన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి కల్పించినట్లు తెలిపారు. అన్నదానంతో పాటు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


రామలింగేశ్వరస్వామి మూలవిరాట్

రామలింగేశ్వరుడి కరుణతో..

ఎత్తం గట్టుపై వెలిసిన రామలింగేశ్వరుడు ఎంతో మహిమ గల దేవుడు. స్వామిని తలచుకుంటూ ఏ పని చేసినా ఫలితం దక్కుతుంది. సకల పాపాలు తొలగుతాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా భక్తులు వేలాదిగా దర్శించుకుంటారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదు.

– మురళీధర్, పూజారి

వైభవంగా ఆరుద్రోత్సవం


అలంపూర్‌లో అన్నాభిషేకంలో బ్రహ్మేశ్వర స్వామి

- భక్తులతో కిక్కిరిసిన అలంపూర్ క్షేత్రం
- తీర్థప్రసాదాలు అందజేత

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివార్ల ఆలయంలో సోమవారం ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ఆలయ ప్రాకార ప్రదక్షిణలు, దర్బార్ సేవలు సాగాయి. స్వామివారికి వివిధ పండ్ల రసాలు, పంచామృతాలు, మంగళద్రవ్యాలతో అభిషేకించారు. అన్నసూక్త పఠనంతో స్వామి వారికి శ్వేతాన్నంతో అభిషేకం జరిపారు. అర్చక స్వాములు స్వామివారికి హారతులను ఇచ్చారు. ఆరుద్రోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆది దంపతులైన శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ గుమ్మడికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ప్రాకార ప్రదక్షిణలు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు

అలంపూర్ ఆలయాలను కాకినాడ వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి చెరుకూరి వసంతకుమార్, కర్నూలు వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి కే.కిషోర్‌కుమార్, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్, గొర్రెల–మేకల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారాయుడు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చక స్వాములతో కలిసి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. అలంపూర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటనారయణ, జేవీఓ శ్రీశైలం, వినియోగదారుల కోర్టు సభ్యులు నారాయణరెడ్డి, ఆలయ అధికారులు ఉన్నారు.


అలంపూర్ ఆలయాల్లో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారాయుడు

వేరుశనగలో లద్దె పురుగు, ఆకు ముడత


అలంపూర్‌లో సాగులో ఉన్న వేరుశనగ పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి సక్రియ నాయక్

అలంపూర్: జిల్లా ఈ ఏడాది వేరుశనగ పంటను ఒక మోస్తారుగా సాగు చేశారు. వాతవరణం అనుకూలత ఆధారంగా రైతులు వేరుశనగ సాగుపై దృష్టి సారించారు. సాగుచేసిన వేరుశనగ ప్రస్తుతం 35–45 రోజుల కావస్తోంది. ప్రస్తుత వాతవరణ మార్పులతో లద్దె పురుగు, ముడత, రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. వేరుశనగ పంటలో లద్దె పురుగు, ఆకుముడత కనిపిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంటపై వాటి ఉధృతి పెరిగి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నట్లు పేర్కొంటున్నారు.

లద్దెపురుగు : తల్లి రెక్క పురుగు ఆకు అడుగు భాగంలో గుంపులుగా తింటాయి. దీని వలన పత్రాలన్నీ జల్లెడగా మారుతాయి. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నివారణ : దీని నివారణ కోసం ఫ్లూబెండమయిడ్ 30 మి.లీ, క్లోరాంత్రినిల్‌పోల్ 30 మి.లీ ఎమామెక్టిన్ బెంజోఎయిట్ 100 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


ఆకుముడత ఆశించిన వేరుశనగ మొక్క


పైరుకు ఆశిస్తున్న లద్దెపురుగు

విషపు ఎర : లద్దెపురుగు రాత్రి వేళల్లో ఆకులను తింటూ నష్టపరుస్తుంది. అందువల్ల విషపు ఎరలు ఈ పురుగును బాగా నియంత్రిస్తాయి.

ఎర తయారీ : 10 కిలోల తాడు, ఒక కిలో బెల్లం పాకం మరియు ఒక లీటరు క్లోరోపైరిఫాస్ లేదా మోనోక్రోటోఫాస్‌ను కలిపి ఉండలు ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో చల్లితే లద్దె పురుగును సమర్థవంతంగా నియంత్రించొచ్చు.

ఆకు ముడత : ఈ పురుగు పత్రాలపై ఉంటుంది. రెండు మూడు పత్రాలను కలిపి వాటిలో ఉండి పత్ర హరితాన్ని గోకి తినివేస్తాయి. దీని వలన ఆకులన్నీ ఎండి కాలినట్లు కనిపిస్తాయి.

నివారణ : ఈ పురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీకు లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

మందా జగన్నాథంకు ఘన నివాళి

- నివాళులర్పించిన కేటీఆర్, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు

అలంపూర్: నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథంకు రాజకీయ ప్రముఖులు, అభిమానులు నివాళులర్పించారు. మందా జగన్నాథం గుండె సంబంధిత వ్యాధితో ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రముఖులు, ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీలు పోతుగంటి రాములు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు అబ్రహం, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, శాట్ రాష్ట్ర మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ తదితరులు నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజకీయాల్లో, వ్యక్తిగతంగా మందాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన స్వగ్రామం కొండేరులో విషాదఛాయలు అలుముకున్నాయి.



మందా జగన్నాథం మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపీ పి.రాములు

గాలిపటం ఎగరవేస్తూ..
అనంత లోకాలకు..

- విద్యుత్ వైర్లు తగిలి బాలుడి మృతి.. మరొకరికి గాయాలు


మనోజ్‌కుమార్ (ఫైల్)

మహమ్మదాబాద్: సంక్రాంతి పండుగ కోసం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఓ బాలుడు స్నేహితులతో కలిసి గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం కంచన్‌పల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన ఆనెం రఘు, చంద్రకళ దంపతులు హైదరాబాద్‌లో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండగ కోసం స్వగ్రామమైన కంచన్‌పల్లికి వచ్చారు. అయితే సోమవారం సాయంత్రం వారి కుమారుడు ఆనెం మనోజ్‌కుమార్(9) తోటి స్నేహితులతో కలిసి గాలిపటం ఎగురవేస్తున్నారు. గాలిపటం తెగిపోయి ఓ ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలకు తట్టుకుంది. వెంటనే తన స్నేహితుడు సాత్విక్‌తో వెళ్లి ఇనుప సీకుతో దాన్ని తీసుకోబోగా.. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందగా.. మరో బాలుడు సాత్విక్ చేతులకు తీవ్ర గాయాలై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే వారిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సాత్విక్ చికిత్స పొందుతున్నాడని, అతని ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు. పండగా పూట బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



వనపర్తిలో చెస్ ఫిడే రేటింగ్ పోటీలకు అవకాశం

- చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శివప్రసాద్
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు



వనపర్తి టౌన్: వనపర్తి జిల్లాలో చదరంగం క్రీడకు అమితమైన ఆదరణ ఉందని.. అందుకు అనుగుణంగా త్వరలో చెస్ ఫిడే రేటింగ్ పోటీలు ఇక్కడ నిర్వహించే అవకాశం ఉందని చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శివప్రసాద్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. అండర్–9 విభాగంలో ఎ.ఆద్విక్, సి.ఆరాధ్య, సాయిధీరజ్, అండర్–13 విభాగంలో జ్ఞానదీపక్, తస్వారెడ్డి, ప్రహ్లాద్, ఓపెన్ విభాగంలో ఆదిత్యారెడ్డి, హఫీజ్‌రెడ్డి, ఆర్.కిరణ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా.. నగదు బహుమతులు, ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. వనపర్తి క్రీడలకు నిలయమని.. ఆ జాబితాలో చందరంగం పోటీలను చేర్చేందుకు జాతీయస్థాయి పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. చందరంగం క్రీడతో మేధస్సు పెరుగుతుందన్నారు. తద్వారా వినూత్న ఆలోచనా విధానాలకు భీజం పడుతుందన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే చదరంగంపై అవగాహన, ఆసక్తి పెంచాలన్నారు. ఆర్‌బీఐ ట్రైటర్ చంద్రమౌళి మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి చదరంగం పోటీల్లో దేశాన్ని నిలబెట్టిన గుకేష్‌ది తెలంగాణ ప్రాంతం కావడం గర్వించదగ్గ విషయమన్నారు. గుకేష్‌కు ట్రైనర్‌గా తాను పనిచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బసవప్రభు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కన్వీనర్ టీపీ కృష్ణయ్య, గణేశ్ కుమార్, వేణుగోపాల్, రాములు, రాంకుమార్, డా.మురళీధర్, ఎద్దుల నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలతో చెస్ అసోసియేషన్ సభ్యులు

సెమీస్‌లో తెలంగాణ జట్లు


గుజరాత్ జట్టుపై గోల్ చేస్తున్న తెలంగాణ క్రీడాకారుడు


బాలికల విభాగం తెలంగాణ-పంజాబ్ మ్యాచ్

- టోర్నీలో వరుస విజయాలతో సత్తాచాటుతున్న ఆతిథ్య జట్లు
- హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్‌లు
- నేడు ముగియనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో అండర్–17 నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఆతిథ్య తెలంగాణ బాలబాలికల జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. టోర్నీలో లీగ్‌దశ నుంచి మెరుగైన ప్రదర్శనను కనబరుస్తున్న బాలుర జట్టు నాకౌట్ దశలో కూడా అదే స్థాయిలో ప్రతిభ చాటుతోంది. సోమవారం జరిగిన బాలుర క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 16–9 గోల్స్ తేడాతో హర్యానా జట్టుపై, రాష్ట్ర బాలికల జట్టు 18–10 తేడా తో కేరళ జట్లపై గెలుపొందాయి. ఇతర బాలుర విభాగం క్వార్టర్‌ఫైనల్ మ్యాచుల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు 18–11 తేడాతో పంజాబ్ జట్టుపై, రాజస్తాన్ జట్టు 17–3 తేడాతో వెస్ట్ బెంగాల్ జట్టుపై, ఉత్తరప్రదేశ్ జట్టు 20–17 తేడాతో కేరళ జట్లపై గెలుపొందాయి. బాలికల విభాగం క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో హర్యానా జట్టు 13–12 గోల్స్ తేడాతో ఉత్తరప్రదేశ్ జట్టుపై, రాజస్తాన్ జట్టు 13–9 తేడాతో తమిళనాడు జట్లపై విజయం సాధించాయి.

ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు

అంతకుముందు బాలుర విభాగం ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో తెలంగాణ జట్టు 18–13 గోల్స్ తేడాతో గుజరాత్ జట్టుపై, హర్యానా జట్టు 18–14 తేడాతో చండీఘర్‌పై, రాజస్తాన్ జట్టు 26–7 తేడాతో కర్నాటకపై, వెస్ట్‌బెంగాల్ జట్టు 18–14 తేడాతో చత్తీస్‌ఘడ్‌పై, ఉత్తరప్రదేశ్ జట్టు 19–14 తేడాతో బీహార్‌పై, కేరళ జట్టు 24–21 తేడాతో ఎన్‌వీఎస్‌పై, పంజాబ్ జట్టు 16–8 తేడాతో డీఏవీపై, ఆంధ్రప్రదేశ్ జట్టు 17–10 తేడాతో ఢిల్లీపై విజయం సాధించాయి. బాలికల విభాగం మ్యాచుల్లో హర్యానా జట్టు 20–12 తేడాతో మహారాష్ట్రపై, ఉత్తరప్రదేశ్ జట్టు 14–5 తేడాతో వెస్ట్‌బెంగాల్ జట్టుపై, తెలంగాణ జట్టు 11–6 తేడాతో పంజాబ్ జట్టుపై, కేరళ జట్టు 12–9 తేడాతో కర్నాటకపై, రాజస్తాన్ జట్టు 6–3 తేడాతో బీహార్‌పై, తమిళనాడు జట్టు 18–7 తేడాతో మధ్యప్రదేశ్‌పై, గుజరాత్ జట్టు 16–6 తేడాతో చండీఘర్‌పై, హిమాచల్‌ప్రదేశ్ జట్టు 13–7 తేడాతో ఒడిస్సాపై గెలుపొందాయి.

నిలిచిపోయిన బాలికల క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్

- కోర్టులో భైఠాయించిన గుజరాత్ జట్టు


కోర్టులో భైఠాయించిన గుజరాత్ బాలికల జట్టు

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం రాత్రి జరిగిన బాలికల క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో కొంత గందరగోళం నెలకొంది. హిమాచల్‌ప్రదేశ్–గుజరాత్ జట్ల మధ్య క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఈ దశలో మ్యాచ్ రెండో అర్ధభాగంలో ఒక నిమిషం ఉండగా హిమాచల్‌ప్రదేశ్ 13, గుజరాత్ 12 గోల్స్‌తో ఆడుతున్నాయి. అయితే రెఫరీలు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ గుజరాత్ జట్టు బాలికలు హ్యాండ్‌బాల్ కోర్టులో భైఠాయించారు. దీంతో మ్యాచ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. మళ్లీ రెఫరీలు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని నిరసన తెలిపారు. ఎస్‌జీఎఫ్‌ఐ ఫీల్డ్ ఆఫీసర్ దేవేందర్‌నాథ్ గోస్వామి తదితరులు గుజరాత్ జట్టు బాలికలు, కోచ్‌తో చర్చించారు. అయినా గుజరాత్ జట్టు బాలికలు కోర్టులో భైఠాయించారు. ఈ విషయమై ఫీల్డ్ ఆఫీసర్‌ను వివరణ కోరగా హిమాచల్‌ప్రదేశ్–గుజరాత్ బాలికల క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌పై ఎస్‌జీఎఫ్‌ఐకు సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. మ్యాచ్‌పై ఎలాంటి అనుమానాలు ఉన్నా నిబంధనల మేరకు గుజరాత్ జట్టు లిఖితపూర్వకంగా రాసివ్వాల్సి ఉంటుందన్నారు. ఈ మ్యాచ్‌పై ఎస్‌జీఎఫ్‌ఐ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అయితే ఈ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ నిర్వహించకపోవడంతో వల్ల తర్వాత జరగాల్సిన సెమీఫైనల్ మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి.

క్రీడలతో మానసిక ఉల్లాసం: డీఎస్పీ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీఎస్‌పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్–17 జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ మ్యాచ్‌ల సందర్భంగా సోమవారం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. క్రీడల్లో ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఎజాజుద్దీన్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, రజనికాంత్‌రెడ్డి, ఫారుఖ్ ముకర్రం, అహ్మద్ హుస్సేన్, పీఈటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్కమహాదేవీ గుహల సందర్శనకు సదావకాశం


అక్కమహాదేవి గుహలకు బోటుపై వెళ్లేందుకు బయలుదేరుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో నూతనంగా ఏర్పాటు చేసిన దోమలపెంట, అక్కమహాదేవీ స్టే ప్యాకేజీని సోమవారం దోమలపెంటలోని ఫారెస్ట్ ఆఫీస్ కార్యాలయం వద్ద అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. సందర్శకులు నల్లమలలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కృష్ణానదిలో బోట్ ద్వారా, జంగిల్ సఫారి జీపు ద్వారా అక్కమహాదేవి గుహలను సందర్శించి అక్కడ శివయ్యను దర్శించుకుని, తిరిగి దోమలపెంటలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిర్మించిన వన విహంగ అతిథి గృహంలో విడిది చేయవచ్చన్నారు. సందర్శకులు రాకపోకల వలన ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఫారెస్ట్ రిసెప్షన్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం కృష్ణానదిలో బోట్‌లో అక్కమహాదేవి గుహలకు వెళ్లారు. సందర్శకుల సహాయార్థం నియమించిన గైడ్ చెంచు లింగమ్మను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ రోహిత్ గోపిడి మాట్లాడుతూ దోమలపెంట అక్కమహాదేవి స్టే ప్యాకేజి గురించి వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రామ్మూర్తి, ఎఫ్ఆర్ఓ గురుప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

భూగర్భ కేంద్రాన్ని పరిశీలించిన జెన్‌కో సీఎండీ


భూగర్భ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఇంజినీర్లు తదితరులు

దోమలపెంట: భూగర్భ కేంద్రాన్ని టీఎస్ జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి, ఏఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్) రవీంద్రకుమార్‌ను అడిగి కేంద్రం స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రధానంగా ఇటీవలే కేంద్రంలో నీటి ఊట పరిస్థితిని క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికి వచ్చినట్లు సమాచారం. స్థానికంగా దోమలపెంటలో పర్యటిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఈగలపెంటలోని జెన్‌కో అతిథిగృహంలో సీఎండీని కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా టీఎస్ఈఏ ఈఏ ఇంజినీర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌గౌడ్ సీఎండీని కలిసి ఏఈలు, ఏడీఈల సమస్యలు, సాధారణ బదిలీలపై వినతిపత్రం సమర్పించారు.ఆయన వెంట హైడెల్ డైరెక్టర్ సచ్చిదానందం, కేంద్రం ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇరువురికి గాయాలు

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో సోమవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పొలం వద్ద నుంచి ఇంటికి బైక్‌పై వస్తున్న నవదీపాచారి అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయలు కావడంతో కుటుంబసభ్యులు వెంటనే అతడిని వెల్దండ సమీపంలోని యెన్నం ఆస్పత్రికి తరలించారు. మరో వాహనదారుడు సోనమోని బాలనారాయణకు స్వల్పగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

వాట్సాప్ లింక్‌తో రూ.19 లక్షలు స్వాహా

- ట్రేడింగ్ పేరుతో నమ్మించి సైబర్ నేరగాళ్ల మోసం
- చివరికి మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు



కల్వకుర్తి టౌన్: వాట్సాప్‌కు ట్రేడింగ్ పేరుతో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడంతో ఏకంగా రూ.19.70 లక్షలు కోల్పోయిన కల్వకుర్తిలో వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. కల్వకుర్తిలో నివాసం ఉంటున్న ఎంపీహెచ్ఎస్ ఉద్యోగి ప్రమోద్‌కుమార్ మండలంలోని రఘుపతిపేట పీహెచ్‌సీలో పనిచేస్తున్నాడు. ప్రమోద్ వాట్సప్‌కు నెలరోజుల క్రితం ఎస్ఎస్ఐఎల్ పేరుతో షేర్ మార్కెట్ ట్రేడింగ్ అకౌంట్ లింక్ వచ్చింది. లింక్‌ను ఓపెన్ చేసి నెలరోజులుగా ట్రేడింగ్ చేస్తూ వచ్చాడు. మొదట సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా అకౌంట్ ఓపెన్ చేయడంతో అతనికి మొదట్లో రూ.వెయ్యి, 2 వేలు, 5 వేల డబ్బులు అకౌంట్‌కు వచ్చాయి. అతనూ 5 వేర్వేరు నంబర్లకు డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ట్రేడింగ్ చేశాడు. డబ్బులు బాగానే వస్తున్నాయని భావించి.. నెల రోజుల వ్యవధిలో మొత్తం రూ.19.70 లక్షలు డిపాజిట్ చేయడంతో అతనికి తన పోర్ట్‌ఫోలియో విలువ రూ.51.44 లక్షలు చూయించగా దానిని విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా రాలేదు. విత్ డ్రా ఎందుకు రావడం లేదని వాట్సాప్ ద్వారానే సైబర్ నేరగాళ్లు జవాబు ఇస్తుండటంతో అలాగే వారిని సంప్రదించాడు. వారిని సంప్రదించిన తర్వాత రూ.10.28 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేస్తేనే ఆ డబ్బులను విత్‌డ్రా చేయడానికి వీలవుతుందని చెప్పడంతో అనుమానం వచ్చింది. వెనువెంటనే అతను ట్రాన్స్‌ఫర్ చేసిన డబ్బులు, ఆ ఫోన్ నంబర్లు పూర్తిగా పనిచేయలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ట్రేడింగ్‌లో డబ్బులు ఎక్కువగా వస్తున్నాయన్న ఆశతో బాధితుడు డబ్బులను సమకూర్చుకునేందుకు అతనికి ఉన్న ప్లాటును సైతం మార్కెట్ ధర కంటే తక్కువకు అమ్మి ఫ్రాడ్ ట్రేడింగ్‌లో పెట్టాడని సమాచారం. భవిష్యత్ కోసం దాచుకున్న రూ.లక్షల డబ్బులు మోసపోయానని తెలియడంతో బాధితుడితోపాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

టోర్నీలో చాంపియన్లుగా నిలుస్తాం

మబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో జరుగుతున్న అండర్–17 నేషనల్ స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలబాలికల జట్లు సత్తాచాటుతున్నాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్నాయి.ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరిన తెలంగాణ జట్లు చాంపియన్‌షిప్‌ను సాధిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జట్లలో చోటు దక్కించుకున్న కొంతమంది మహబూబ్‌నగర్‌కు చెందిన జిల్లా బాలబాలికల అభిప్రాయాలు...

రెండోసారి నేషనల్ పోటీల్లో..



రెండోసారి నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. గత ఏడాది సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ నేషనల్ టోర్నీ ఆడాను. గతంలో ఒకసారి బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. సొంత ఊరులో జాతీయ స్థాయి హ్యాండ్ టోర్నీలో ఆడుతుండడం ఎంతో బాగుంది.

– బి.పారిజాత (మహబూబ్‌నగర్)

మొదటిసారి నేషనల్ టోర్నీలో..



రెండుసార్లు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. మొదటిసారి అది కూడా జిల్లా కేంద్రంలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నందుకు చాలా ఆనందంగా ఉంది. జట్టులో క్రీడాకారుడిగా నాలుగో పొజిషనల్‌లో ఆడుతున్న.

– వి.సాత్విక్ (మహబూబ్‌నగర్)

గెలుపు తెలంగాణదే..



జిల్లాకేంద్రంలో నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ జరుగుతుండడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు ఏడు రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా టోర్నీలు, మధ్యప్రదేశ్‌లో జరిగిన నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న. టోర్నీలో తెలంగాణ బాలికల జట్టు విజయం సాధిస్తుంది.

– సాయి లక్ష్మిప్రియ (మహబూబ్‌నగర్)

రైట్ వింగ్ క్రీడాకారుడిగా..



హ్యాండ్‌బాల్ క్రీడ అంటే ఎంతో ఇష్టం. రాష్ట్ర జట్టులో రైట్ వింగ్ క్రీడాకారుడిగా ఆడుతున్న. గతంలో రెండుసార్లు అంతర్‌జిల్లా పోటీల్లో పాల్గొన్న. మొదటిసారి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న. టోర్నీలో తెలంగాణ జట్టు ఎంతో పటిష్టంగా ఉంది, చాంపియన్‌గా నిలుస్తామన్న నమ్మకం ఉంది.

– మహ్మద్ సాఖిబుద్దీన్ (మహబూబ్‌నగర్)

వైభవంగా గోదాదేవి కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయ కమిటీ
- అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఆలయంలో ప్రత్యేకపూజలు


కురుమూర్తి స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను పురస్కరించుకొని సోమవారం గోదాదేవి, శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి కల్యాణ మంటపాన్ని పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ అందించిన పట్టువస్త్రాలను స్వామిఅమ్మవార్ల ఉత్సవవిగ్రహాలకు ధరించారు. పండితుల వేద మంత్రోచ్చరణలతో కల్యాణం జరిపించారు. ఈ ఉత్సవానికి వివిధ గ్రామాలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి తిలకించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఆలయ ఈఓ మధునేశ్వరెడ్డి, ఆలయ ప్రధానఅర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంతవిజయ్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కనుల పండువగా వేంకటేశ్వరుడి...

- సర్వాంగ సుందరంగా అలంకరణ
- తరలివచ్చిన భక్తులు


అలంకరణలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దంపతులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రకరకాల పూలు, వివిధ ఆభరణలతో స్వామివార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తులు తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు అర్చకులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో తేలిన సంగమేశ్వరాలయ గోపురం


కృష్ణానదిలో తేలిన సంగమేశ్వరాలయ గోపురాలు

గర్భగుడి గోపురానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు రఘురామశర్మ

కొల్లాపూర్: సప్తనదీ సంగమ ప్రాంతంలో కృష్ణానది నీటిలో మునిగిఉన్న సంగమేశ్వరాలయ గోపురం తేలింది. కొంతకాలంగా నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. ఆలయ గోపుర శిఖరం కొన్నిరోజుల కిందటే తేలడంతో భక్తులు మరబోట్లలో వెళ్లి శిఖర భాగాన్ని దర్శించుకుని వచ్చేవారు. సోమవారం ఆలయ గర్భగుడి గోపురం పూర్తిగా దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు రఘురామశర్మ మరబోటులో వెళ్లి గోపురానికి పూజలు చేశారు. గోపురం దర్శనానికి వచ్చే భక్తులు ఆలయ ప్రాంగణానికి దూరంగా ఉండి దర్శించుకోవాలని, గోపురం దగ్గరికి వస్తే ప్రాంగణంలోని ఇతర గుడుల శిఖరాలు బోట్లకు తగిలే ప్రమాదం ఉంటుందని సూచించారు. కృష్ణానది బ్యాక్ వాటర్ లెవెల్ ప్రస్తుతం 857అడుగుల ఎత్తులో ఉంది. నీటిమట్టం తగ్గుతున్న క్రమాన్ని బట్టి మరో నెలరోజుల్లో ఆలయం పూర్తిగా తేలే అవకాశం ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,020 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేసారు. ఎన్‌టీఆర్ కాల్వకు 42 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని నియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.